క్లుప్తంగా

నేడు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి వర్ధంతి



చీమకుర్తి: దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి 4వ వర్ధంతిని గురువారం చీమకుర్తిలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పీఏ నరేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూచేపల్లి కల్యాణ మండపంలో పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత బూచేపల్లి కమలాకర్‌రెడ్డి పార్కులో బూచేపల్లి సుబ్బారెడ్డి ఘాట్ వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులు కలిసి సుబ్బారెడ్డికి ఘనంగా నివాళులర్పిస్తారని తెలిపారు.

5 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి వేలం కేంద్రంలో బుధవారం నాటికి 54 రోజుల పాటు నిర్వహించిన వేలంలో 5 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరిపినట్లు వేలం నిర్వహణ అధికారి ఎం.సత్యశ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో రైతులకు లోగ్రేడు పొగాకుకు మంచి ధర లభిస్తోందని చెప్పారు. ఈ విషయమై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతులకు కంపెనీల ద్వారా మంచి ధర ఇప్పించేందుకు తాము నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులు తాము తీసుకొచ్చే పొగాకు బేళ్లను సరిచూసుకుంటూ సాఫ్ట్ హీట్, డ్యామేజ్ రకాలను తీసుకురాకుండా బేళ్లను గ్రేడ్ చేసి తీసుకొస్తే వెనక్కు తీసుకెళ్లే అవసరం రాదన్నారు. అదే విధంగా మంచి ధర లభించడానికి అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 38 మందికి ఉద్యోగాలు

ఒంగోలు: స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దక్షిణామూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా మెడికల్ కోడింగ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. మొత్తం 102 మంది విద్యార్థులు వెబ్ ఆధారిత టెక్నికల్ పరీక్షకు హాజరవగా, వారిలో 75 మంది బృంద చర్చకు అర్హత సాధించారన్నారు. వారిలో 38 మంది విద్యార్థులు రాణించి ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కాలేజీ కరస్పాండెంట్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ కె.సెంథిల్ కుమార్ అభినందించారు.

పార్టీలకతీతంగా జగనన్న సంక్షేమం

- ఎస్‌ఎన్ పాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. ఒంగోలు కార్పొరేషన్‌లోని పేర్నమిట్ట పరిధిలో 39, 40 డివిజన్లలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా డివిజన్లలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడంలో అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం లబ్ధిదారులకు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయా వార్డులలో ప్రజల సమస్యలు



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

పరిష్కరించడంలో కార్పొరేటర్లు చురుగ్గా వ్యవహరిస్తున్నారని అభినందించారు. పథకాలు పొందిన లబ్ధిదారుల గడపలకు వెళ్లి ఏ ఇంట్లో ఎంతెంత ఆర్థిక ప్రయోజనాలు పొందారో అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేసి జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు స్థానిక ప్రజలు హారతులు పడుతూ పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో 39, 40 డివిజన్ల కార్పొరేటర్లు గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, తిరుపతిరావు, తేళ్ల చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో డిగ్రీ విద్యనభ్యసించేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భాగ్యనగర్ 11వ లైనులో ఉన్న తమ కాలేజీలో బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ (ఆక్వాకల్చర్, జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (మ్యాథ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, కంప్యూటర్ సైన్స్), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కోర్సులో 30 సీట్లు ఉన్నాయని, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు తమ కళాశాలను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన విద్యార్థులకు ఉచిత వసతి సదుపాయం ఉందన్నారు. టెక్నాలజీ పరంగా ఉద్యోగ అవకాశాలు కూడా విద్యార్థినులు అందుకుంటున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

టెండర్ దశకు అమృత్–2 మంచినీటి పథకం

- ఒంగోలు నగరంలో మంచినీటి వ్యవస్థ రూపురేఖలు మారనున్న వైనం
- రూ.339.93 కోట్లతో మంచినీటి పథకం పనులు
- ఈ నెల 11 నుంచి టెండర్ బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు
- టెక్నికల్ బిడ్ ఓపెనింగ్‌కు 27 వరకు గడువు

ఒంగోలు సబర్బన్: నగర ప్రజల చిరకాల కోరిక తీరేందుకు సమయం ఆసన్నమైంది. ఒంగోలు నగరంలోని మంచినీటి వ్యవస్థకు సంబంధించి రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నగర ప్రజలకు ప్రతిరోజూ రక్షిత మంచినీరు ఇవ్వాలన్న ఆశయం నెరవేరే రోజులు దగ్గరకు వచ్చాయి. నగరంలో మంచినీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు మంజూరు చేసిన అమృత్ 2.0 పథకం టెండర్ దశకు చేరుకుంది. జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్లిన ఈ పథకం.. అక్కడ సాంకేతికపరమైన అన్ని పరీక్షలు పూర్తి చేసుకుని టెండర్ ప్రక్రియకు చేరింది. రూ.339.93 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన ఈ పథకం ద్వారా ఒంగోలు నగర ప్రజలకు పూర్తి స్థాయిలో మంచినీరు అందించేందుకు రామతీర్థం జలాశయం నుంచి సాగర్ నీటిని తరలించే విధంగా రూపకల్పన చేశారు. పథకాన్ని రెండు సంవత్సరాల్లో పూర్తి చేసే విధంగా నిబంధనలు పొందుపరిచారు. ఐదు సంవత్సరాల పాటు పథకాన్ని కాంట్రాక్టర్ నిర్వహించే విధంగా కార్యాచరణ చేపట్టారు. ఆ మేరకు నెల్లూరు పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.గోపాల్‌రెడ్డి టెండర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు బిడ్ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకునే విధంగా ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. బిడ్ డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఈ నెల 27 సాయంత్రం 4 గంటల వరకు గడువు విధించారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఎంతమంది టెండర్ ప్రక్రియలో పాల్గొన్నారో వెల్లడిస్తారు. 5.30 గంటలకు టెక్నికల్ బిడ్ తెరుస్తారు. ఆ రోజే టెండర్ పొందిన కాంట్రాక్టర్ ఎవరన్నది వెల్లడిస్తారు.

ఎయిడ్స్ బాధితుల కోసం సంపూర్ణ సురక్ష కేంద్రం

- ప్రారంభించిన నాకో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ దాస్

ఒంగోలు అర్బన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులకు అన్ని రకాల వైద్య సేవలు, పరీక్షలు, ఆదరణ సేవలు ఒకే చోట అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని రిమ్స్‌లోని 116 వార్డులో ఏర్పాటు చేశారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ అథారిటీ (నాకో) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యుబి దాస్ ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ సురక్ష కేంద్రం ఆవశ్యకతను బాధితులకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. సెక్స్ వర్కర్లకు ఉచిత పరీక్షలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. రిమ్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ కేంద్రం, ఏఆర్‌టీ సెంటర్, వైరల్‌లోడ్ పరీక్షా కేంద్రం, డీఎస్‌ఆర్‌సీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి సభ్యులు పూర్ణిమ, రహూల్, అహూజ, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి డాక్టర్ కామేశ్వర్‌ప్రసాద్, బాలాజీనాయక్, కిషోర్, సేతుబాబు, రంగారావు, రవికుమార్, సురేష్, బీవీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ దాస్



రేపటి నుంచి ఏపీ ఈఏపీసెట్ మాక్ టెస్ట్

ఒంగోలు: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు ఏపీ ఈఏపీసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 12, 13 తేదీల్లో ఉచితంగా మాక్ టెస్టు నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత న్యామతుల్లాబాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, గుంటూరు, విజయవాడ, నెల్లూరులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వాగుపోరంబోకు భూముల్లో గ్రానైట్ లీజులు ఇవ్వొద్దు



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న గుండా శ్రీనివాసరావు

చీమకుర్తి: వాగు పోరంబోకు భూముల్లో కృష్ణసాయి గ్రానైట్ యాజమాన్యం దరఖాస్తు చేసుకున్న గ్రానైట్ లీజులను ఇవ్వొద్దని బీజేపీ నాయకుడు గుండా శ్రీనివాసరావు ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. బూదవాడ సర్వేనంబర్ 104/పీలో 1.392 హెక్టార్లలో కృష్ణసాయి గ్రానైట్ యాజమాన్యం దరఖాస్తు చేసుకున్న లీజుకు సంబంధించి బుధవారం రామతీర్థంలోని వీటీసీ కేంద్రంలో ఆర్డీవో, తహసీల్దార్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండా శ్రీనివాసరావు తన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. వాగు పోరంబోకులలో గ్రానైట్ లీజులు ఇవ్వడం వలన పొలాలకు నీటి పారుదల ఆగిపోతుందని, పశువులకు తాగునీరు కలుషితమవుతుందని వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు.

మేళతాళాలతో ధ్వజస్తంభానికి స్వాగతం



ధ్వజస్తంభంతో ఆలయ పాలకులు, అధికారులు

ఒంగోలు: స్థానిక గంగా అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న జీవ ధ్వజస్తంభం బుధవారం ఒంగోలు చేరుకుంది. 55 అడుగుల ఎత్తైన ధ్వజస్తంభాన్ని ఈ నెల 14న ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభానికి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం, సభ్యులు, ఆలయ ఈవో రజనీ కుమారి, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

132/33 కేవీ సబ్‌స్టేషన్ తనిఖీ



సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, విద్యుత్ అధికారులు

కొత్తపట్నం: స్థానిక 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను విజయవాడ నుంచి వచ్చిన విద్యుత్ ఎస్‌ఈ ఎస్.రామచంద్రారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నందున ఎంత వరకు చేశారు, ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారనే వివరాలడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కూడా పరిశీలించారు. జూలై నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత వర్షాకాలం వస్తే పనులు చేయలేరని చెప్పారు. ఒంగోలు, టంగుటూరు నుంచి కొత్తపట్నం వచ్చే లైన్‌కు కూడా మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నుంచి కొత్తపట్నం వచ్చే టవర్లు 50 వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 17 పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగతావి వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని, త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. రెండునెలల్లో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో లిఖితా ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టర్ యల్లమందారెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, సివిల్ ఇంజినీర్ సంజీవరెడ్డి, ఏడీ రామాంజనేయులు, ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రెండో సెట్ ప్రశ్నపత్రాలను విత్‌డ్రా చేసుకోవాలి

ఒంగోలు: ఎస్ఎస్‌సీ–2023 పరీక్షలకు సంబంధించి పోలీసుస్టేషన్లలో భద్రపరిచిన రెండో సెట్ ప్రశ్నపత్రాల మెటీరియల్‌ను విత్‌డ్రా చేసుకోవాలని హెడ్మాస్టర్లు/చీఫ్ సూపరింటెండెంట్లను డీఈవో పి.రమేష్ ఆదేశించారు. విత్‌డ్రా చేసిన పేపర్లను జాగ్రత్తగా వారి కస్టడీలో భద్రపరచాలన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసేవారికి ఈ నెల 13 చివరి తేదీ అని అన్నారు. రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసేవారు సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసేవారు సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

